## 74 క్రీస్తునకు మంగళార్చన

రా – ఆనందభైరవి తా – ఆది

వందనమే యేసునకు – వరుసుగుణోదారునకు = సౌందర్య ప్రభువునకు సర్వేశ్వర నీకు ॥వందనమే॥

1. యెహోవా తనయునకు – ఇమ్మానుయేలునకు = బహు కరుణాభరణునకుఁ – ప్రభువుల ప్రభువునకు ॥వందనమే॥
2. ఆశ్రిత జనపాలునకు – నకలుష వర దేహునకు = ఇశ్రాయేల్ రాజునకు – యెహోవా నీకు ॥వందనమే॥
3. మరియాతనూజునకు – మహిమ గంభీరునకుఁ = పరిశుద్ధాచరణునకుఁ = బరమేశ్వర నీకు ॥వందనమే॥
4. రాజులపై రాజునకు – రవికోటి తేజునకుఁ = పూజార్హపదాబ్జునకు – భువనావన నీకు ॥వందనమే॥
5. ప్రేమ దయా సింధునకు – క్షేమామృత పూర్ణునకు = ఆమే నని సాష్టాంగము – లర్పింతుము నీకు ॥వందనమే॥

– పురుషోత్తము చౌధరి

## 75 క్రీస్తుకు మంగళ స్తోత్రము

రా – మారువ (చాయ: సందియము వీడవే) తా – అట

మంగళంబని పాడరే – క్రీస్తుకు జయ – మంగళంబని పాడరే – యేసుకు జయ – మంగళంబని పాడరే= మంగళంబని పాడి [1]సజ్జ – నాంగ పూజితుఁడై [2]కృపాత – రంగిలోక సమూహ పాపవి – [3]భంగుడని యుప్పొంగి జయజయ ॥మంగళ॥

1. ఘన యూద దేశంబులో – బెత్లెహే – మున యూదా గోత్రంబులో = వినుఁ డు యేసేపునకు సతియై – తనరుచుండెడి మరియ కడుపున – జననమై యీ మర్త్య వరులకు – సద్గతిని గల్గించు వానికి ॥మంగళ॥

[1]సజ్జన సమూహముచేత పూజింపబడిన వాడై. [2]అలలవంటి కృపగలవాడు [3]నాశనము చేయువాడు.



2. సోదరాళి భంగిని – భక్తుల నెల్లఁ – జూచి ప్రోచెదు వానిని = యూద దేశపు వారలధిక – బాధఁ బెట్టుచు హింసఁజేసిన – సాదరంబున [1]త్రిదినములకు ముదముతో గనుపడిన ప్రభునకు ॥మంగళ॥
3. ధరణి నొల్చెడి దాసజ – నములనుఁబ్రోచు – దైవ తనయుఁడని నిజ = [2]మరయ నిలను స్మరించువారికి – గురుతరంబగు [3]కలుష జలనిధి – దరికిఁ జేర్చు పరమ పదమే – [4]యిరు వొనర్చెద ననిన ప్రభునకు ॥మంగళ॥

– పురుషోత్తము చౌధరి

## 76 క్రీస్తు యేసునకు మంగళహారతి

రా – ఆనందభైరవి (చాయ: తెలుగు తల్లికి వందనం) తా – అట చాపు

క్రీస్తుయేసుకు మంగళం మా – కీర్తి రాజుకు మంగళం = క్రీస్తుయేసే దైవమంచును – కూడి పాడుదు మంగళం॥

1. ప్రవచనంబులు బల్కినట్టి – ప్రాణనాథుడవీవె నీదు = స్తవము జేయుచు మెలగు మనుజుల – సత్ప్రభువుకిదె మంగళం ॥క్రీస్తు॥
2. జగమునేలెడు జీవనాథుడ – జపములందెడు గృపకటాక్ష = అగణీ తంబగు ప్రేమజూపిన – అమరతేజుడ మంగళం ॥క్రీస్తు॥
3. ఖలుల బ్రోచెడు కనికరాత్మ – కేంద్ర స్థానము నీ పదాబ్జము = కలుషమును కడమార్చినట్టి – సిలువ నాథుడ మంగళం ॥క్రీస్తు॥
4. మనము గోరెడు మా హృదీశుడ – మార్గదర్శుడ వీవెగావ = అనయము నినుగొల్చు జనముల – ఆది దేవుడ మంగళం ॥క్రీస్తు॥
5. జనకసుత శుద్ధాత్మ దేవుడ – గనని వినని ప్రేమ పూర్ణుడ = తనివితీరగ పాడుదము యీ – ధాత్రి నీకగు మంగళం ॥క్రీస్తు॥

– సి. రవివర్మ

[1]మూడురోజులకు. [2]విచారింపగా [3]పాపసముద్రము [4]నివాసము.